క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: అయ్యప్పస్వామి జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు శనివారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. షీలానగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం ఆలయంలోని శబరి విద్యానికేతన్‌లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, శబరి విద్యానికేతన్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంఘం గౌరవ అధ్యక్షులు చరపాక నాగార్జున రాజు, అధ్యక్షుడు ఎస్.ఆర్.వైద్యనాథన్, చీఫ్ కో–ఆర్డినేటర్ నంబారు రాజు తదితరులు పాల్గొన్నారు. పోటీల పర్యవేక్షకులుగా అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బి.రవిచంద్, ఉపాధ్యాయుడు డి.ప్రసాద్, తేజ వ్యవహరించారు.

వెంకన్న సన్నిధిలో అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఆకుల అప్పలసూరి, పెంటకోట రాజు, రామలక్ష్మి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్షయ నివారణ



క్షయపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఫార్మా విద్యార్థులు

అగనంపూడి: టీబీ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమేనని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రపంచ క్షయ వాధి దినోత్సవం, ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సమీప గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలోఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి పాల్గొన్నారు.

‘కార్మికులను చిన్నచూపు చూస్తే పతనమే’

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1136వ రోజు సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు. కార్మికులను చిన్న చూపు చూసిన ఎన్నో రాజకీయ పార్టీలు ఇప్పటికే దీనస్థితిలో ఉన్నాయని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి భవిష్యత్తులో అదే గతి పడుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని హితవు పలికారు.

అభివృద్ధి.. అద్భుతం

నాడు ఆ ప్రాంతాల్లో ఏ సమస్య చూసినా దశాబ్దాలుగా పెండింగ్. రోడ్ల విస్తరణ, గెడ్డల ఆధునికీకరణ, మురుగునీటి కాలువల అభివృద్ధి, కల్వర్టుల నిర్మాణం.. ఇలా ప్రతి సమస్యా దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్నదే. ఇదీ జీవీఎంసీ 66వ వార్డు దుస్థితి..

నేడు ఈ సమస్యలు గత ఐదేళ్లలో పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యాయి. 45 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కల్వర్టు సమస్యలు సైతం పరిష్కారమై ప్రజలకు సౌకర్యవంతంగా మారాయి. దీనికోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఈ వార్డులో రూ.15 కోట్లకు పైగా వెచ్చించి పనులు చేపట్టడంతో సమస్యలు పరిష్కారమయ్యాయి.

- ప్రగతి పథంలో 66వ వార్డు
- దశాబ్దాల నాటి సమస్యలు.. ఐదేళ్లలో పరిష్కారం
- రూ.15 కోట్లతో మౌలిక వసతులు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



శివాజీనగర్ బీటీ రోడ్

గాజువాక: జీవీఎంసీ 66వ వార్డులో అభివృద్ధి పనులు అద్భుతః అనిపించే రీతిలో జరిగాయి. స్థానికులు ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న ప్రగతి ఐదేళ్లలోనే సాకారమైంది. దశాబ్దాల నాటి సమస్యలు పరిష్కారమై వసతులు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

వార్డులోని కణితి రోడ్‌ను వంటిల్లు జంక్షన్ నుంచి కొత్త గాజువాక మార్కెట్‌ను ఆనుకొని ఉన్న బీసీ రోడ్ వరకు విస్తరించారు. దీనికోసం రూ.6.4 కోట్లను ఖర్చు చేస్తున్నారు. అందులో భాగంగా 66 అడుగుల వెడల్పుతో 1.25 కిలోమీటర్ల మేర విస్తరణకు రూ.3 కోట్లను, రోడ్డుకిరువైపులా కాలువల నిర్మాణానికి మరో రూ.1.9 కోట్లను ఖర్చు చేస్తున్నారు. విస్తరణలో భాగంగా రూ.90 లక్షలతో అజీమాబాద్ గెడ్డపై వంతెన నిర్మించారు. అదనంగా రూ.1.5 కోట్ల ఖర్చుతో ఫుట్‌పాత్‌లను అందుబాటులో తెస్తున్నారు.



రూ.70లక్షలతో అభివృద్ధి చేసిన బీసీ రోడ్

బీసీ రోడ్డు విస్తరణ

బీసీ రోడ్ అంటేనే ట్రాఫిక్ కష్టాలకు నిలయంగా చెప్పవచ్చు. అలాంటి రోడ్డు అభివృద్ధి కత్తిమీద సాములా మారినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం ఆ పనిని పూర్తి చేసింది. ఈ రోడ్డును రూ.70 లక్షలతో అభివృద్ధి చేసి రోడ్డు మధ్యలో రూ.11 లక్షలతో డివైడర్‌ను, మరో రూ.19 లక్షలతో సెంట్రల్ లైటింగ్‌ను అమర్చారు. ఈ కారణంగా బీసీ రోడ్‌లో వన్ వే సౌకర్యం అందుబాటులోకి వచ్చి, ట్రాఫిక్ సమస్యలు తగ్గాయి.

సామాజిక భవనం నిర్మాణం.. ఆరోగ్యకేంద్ర అభివృద్ధి

- ఇందిరాకాలనీలో రూ.50 లక్షలతో రెండంతస్తుల సామాజిక భవనాన్ని నిర్మించారు.
- ఇక్కడే గతంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాన్ని రూ.15 లక్షలతో అభివృద్ధి చేశారు.
- ఆ పక్కనే ఉన్న సివిల్ సప్లై సర్కిల్–3 కార్యాలయానికి రూ.15 లక్షలతో మరమ్మతులు చేశారు.
- వార్డులో నీటి సరఫరా కోసం రూ.50 లక్షలతో మెయిన్ వాటర్ లైన్ ఏర్పాటు చేశారు.

– రూ.40 లక్షలతో కొత్తగా డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ ఏర్పాటు చేశారు.

ప్రతీ కాలనీలో రోడ్లు, డ్రైన్‌లు

- వార్డులోని ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్‌లు, బీటీ రోడ్లు నిర్మించారు. దీనికోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేశారు.
- బీసీ రోడ్ ప్రాంతంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణం
- అరుణాలాడ్జి ఎదురు వీధిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్, మరో రూ.20 లక్షలతో సచివాలయం పక్కన సీసీ రోడ్ నిర్మాణం
- నవాబ్‌నగర్‌లో రూ.50 లక్షలతో ఐదు వీధుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌ల నిర్మాణం
- కైలాస్‌నగర్‌లో రూ.80 లక్షలతో నాలుగు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం
- అజీమాబాద్ ప్రాంతంలో రూ.1 కోటితో 5 సీసీ రోడ్ల నిర్మాణం
- ఇందిరా కాలనీలో రూ.50 లక్షలతో సీసీ కాలువలు, సీసీ కాలువల రిటైనింగ్ వాల్స్ నిర్మాణం
- కణితి రోడ్ నుంచి సింహగిరి కాలనీ వరకు రూ.30 లక్షలతో బీటీ రోడ్ నిర్మాణం
- వార్డులో గెడ్డల అభివృద్ధికి కోట్లాది రూపాయలను ఖర్చు చేశారు.
- వజ్ర కాంప్లెక్స్ నుంచి కై లాస్‌నగర్ సచివాలయం వరకు 25 అడుగుల వెడల్పుతో గల గెడ్డను రూ.1 కోటితో ఆధునికీకరించారు.
- కైలాస్‌నగర్ నుంచి రైతు బజార్ వరకు రూ.1 కోటితో గెడ్డ ఆధునికీకరణ
- అదే ప్రాంతంలో మరో గెడ్డకు రూ.50 లక్షలతో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం
- కబర్‌స్థాన్ వద్ద రూ.90 లక్షలతో గెడ్డకు రిటైనింగ్ వాల్ నిర్మాణం

శంకుస్థాపనలు

- రూ.20 లక్షలతో అజీమాబాద్ మెయిన్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు
- రూ.40 లక్షలతో సున్నీ జామా మసీదు ఎదురు రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



ఇందిరా కాలనీలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనం



కైలాసనగర్‌లో గెడ్డకు రిటైనింగ్ వాల్

కల్వర్టులకు ప్రాధాన్యం

- వార్డులో మురుగునీటి పారుదలకు ఇబ్బంది లేకుండా సీసీ కాలువలను నిర్మించడంలో భాగంగా కల్వర్టుల నిర్మాణానికి కూడా అధిక ప్రాధాన్యతనిచ్చారు.
- కైలాసనగర్‌లోని అమృత నర్సింగ్ హోమ్ వద్ద గెడ్డపై 18 అడుగుల వెడల్పుతో కల్వర్టును నిర్మించారు. పాత కల్వర్టును తొలగించి రూ.30 లక్షలతో కొత్త కల్వర్టును అందుబాటులోకి తీసుకొచ్చారు. 45 ఏళ్ల నుంచి నలుగుతున్న ఈ సమస్యకు పరిష్కారం చూపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- మహిళా రైతు బజార్ వద్ద రూ.12 లక్షలతో మరో కల్వర్టును, అజీమాబాద్ కాలనీలోని సన్‌షైన్ స్కూల్, గ్రో స్కూల్‌వద్ద రూ.55 లక్షలతో రెండు కల్వర్టులను నిర్మించారు. ఇవిగాక నవాబ్‌నగర్ ప్రాంతంలో ఐదు చిన్న కల్వర్టులను నిర్మించారు.
- శ్రీకన్య థియేటర్ మోహిని పాన్‌షాప్ వరకు రూ.20 లక్షలతో బీటీ రోడ్, రూ.10 లక్షలతో కల్వర్టు నిర్మించారు.



అమృత నర్సింగ్ హోం వద్ద రూ.30 లక్షలతో నిర్మించిన కల్వర్టు

కాలనీలో సమస్యలు పరిష్కారమయ్యాయి



మా కాలనీలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉండేవి. రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉండేవి. ఈ సమస్యలను మా కార్పొరేటర్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్‌లను నిర్మించారు. మా వీధిరోడ్లు ఇప్పుడు చాలా బాగున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– షఫీ, నవాబ్‌నగర్

రోడ్లు బాగా వేశారు



మా కాలనీలో చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి. ముఖ్యంగా రోడ్లు, కాలువలు చాలా బాగా వేశారు. మా కాలనీలో మెయిన్ రోడ్, మసీదు రోడ్డుల నిర్మాణానికి కూడా కొద్ది రోజుల క్రితం శంకుస్థాపన చేశారు. గతంలో ఇలా జరగలేదు. ఇప్పుడు మేము అడిగిన వెంటనే చేసిపెట్టారు. అన్ని రకాలుగా మా కాలనీలో అభివృద్ధి పనులు చేశారు.

– సుబ్బారెడ్డి, అజీమాబాద్ కాలనీ

మాకు కమ్యూనిటీ హాల్ వచ్చింది



మా కాలనీలో చిన్న గదితో ఉన్న భవనాన్నే కమ్యూనిటీ హాల్‌గా ఉపయోగించుకునేవాళ్లం. ఇప్పుడు దాన్ని తీసేసి ఆ స్థానంలో రెండంతస్తుల భవనం కట్టారు. అది చాలా బాగుంది. అలాగే మా కాలనీలో రోడ్లు వేశారు. కాలువలను చాలా బాగా కట్టారు. గతంలో కాలువలు సరిగా లేక చాలా ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు బాగున్నాయి.

– ఫాతిమా, ఇందిరా కాలనీ

ఎలక్షన్ మెటీరియల్ ప్రింటింగ్‌లో నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల తరఫున ఎలక్షన్ మెటీరియల్ ప్రింటింగ్‌లో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి సూచించారు. గాజువాక ప్రాంతంలోని ప్రింటింగ్ ప్రెస్‌ల నిర్వాహకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎలక్షన్ మెటీరియల్ ప్రింటింగ్‌లో పాటించాల్సిన నిబంధనలను ఈ సందర్భంగా వివరించారు. కరపత్రాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్ల ప్రింటింగ్‌కు సంబంధిత అభ్యర్థి నుంచి గాని, అభ్యర్థి నుంచి అనుమతి పొందిన వ్యక్తి నుంచి ఆమోదం పొందాలన్నారు. ప్రింట్ వేసిన మెటీరియల్ కాపీలను రిటర్నింగ్ అధికారికి కూడా అందజేయాలన్నారు. ఎన్ని కాపీలు ప్రింట్ చేస్తున్నారో స్పష్టం చేయాలని, దానిపై పబ్లిషర్ పేరు, ప్రింటర్ వివరాలు ఉండాలన్నారు. ప్రింటింగ్‌కు సంబంధించిన బిల్స్‌ను ఈఆర్వో కార్యాలయంలో దాఖలు చేయాలన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127ఏ ప్రకారం బాధ్యులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2000 అపరాధ రుసుం విధించే అవకాశం ఉందన్నారు. ఎలక్షన్ కమిషన్‌తో ప్రింటర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన ‘స్వాతి’



విజేత స్వాతిను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డీఏవీ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కె.స్వాతి ప్రాజెక్టుల రూపకల్పనలో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. పిడిలైట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో గత వారం హైదరాబాద్‌లో వినూత్న సైన్స్ ప్రాజెక్ట్‌లపై ఫెవిక్రీట్ ఆర్ట్ ఇంటిగ్రెటెడ్ ప్రాజెక్ట్ పేరిట పోటీలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ఈ పోటీలకు లక్ష 30 వేల మంది హాజరు కాగా ఎనిమిది మందిని ఫైనల్ పోటీలకు ఎంపిక చేశారు. వారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి స్వాతి మాత్రమే ఎంపిక కావడం విశేషం. ఈ నెల 31న ముంబైలో జరగనున్న ఫైనల్ పోటీలకు స్వాతి హాజరు కానున్నారు. అక్కడ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పిడిలైట్ ఇండస్ట్రీస్ సీఈవో చేతుల మీదుగా స్వాతికి ఫ్లైట్ టిక్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల పీఈటీ కమిటీ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం కె.సంజీవరావు స్వాతిని అభినందించారు.

జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ విజేత గాజువాక



ట్రోఫీతో విజేత జట్టు

మహారాణిపేట: విశాఖ జర్నలిస్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఆంధ్రా మెడికల్ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో గాజువాక జట్టు విన్నర్‌గా నిలిచింది..విశాఖ సిటీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ముగింపు వేడుకలకు సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు, జాతీయ జర్నలిస్ట్‌ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో పెరిగిన ఉద్యోగావకాశాలు



ప్రెజెంటేషన్ ఇస్తున్న ట్రూపర్ కూట్ ప్రతినిధులు

ఉక్కునగరం: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)తో సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరిగాయని ట్రూపర్ కూట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సామిక్ చంద్ర అన్నారు. ‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్’ పై స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధస్సు వల్ల వ్యాపార అవకాశాలు పెరిగాయన్నారు. చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఈశ్వర చంద్ర విద్యాసాగర్ హరీష్ మాట్లాడుతూ వర్క్‌ప్లేస్ సిమ్యులేషన్ గురించి తెలుసుకోవడం వల్ల కలిగే అవకాశాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.తౌడన్న, ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ చేతన్ గౌడ, నిర్వాహకులు విజయ్ మంజేటి, ఆకాంక్ష, అత్తటి రవికుమార్, ప్రశాంత్ నారాయణ, ఎస్.సత్యనారాయణ, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- సీఎం జగన్ ఆత్మీయుడిగా అవకాశం కల్పించారు
- గాజువాకను నగరానికి దీటుగా తీర్చిదిద్దుతా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- 68, 69 వార్డుల నాయకులతో ఆత్మీయ సమావేశం



69వ వార్డు సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ నాయకులు



అక్కిరెడ్డిపాలెంలో విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: ‘ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మీయుడిగా, గాజువాక అభ్యర్థిగా నాకు అవకాశం కల్పించారు. ఇప్పటికే మన సీఎం ఎన్నో పథకాలను అమలు చేస్తూ సంక్షేమ పాలనను అందిస్తున్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి గాజువాకను ఎంతో అభివృద్ధి చేశారు. సంక్షేమం, అభివృద్ధి చూసి నన్ను ఆశీర్వదించండి. మీ అందరి సహకారంతో గాజువాకను మరింత ప్రగతిబాటలో నడిపిస్తాను. విశాఖ నగరానికి దీటుగా తీర్చిదిద్దుతాను’ అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో శనివారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ జెండాను మోసిన వారికి అధిక ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. 69వ వార్డు ప్రజలు, వైఎస్సార్ సీపీ అభిమానులు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. అనంతరం మంత్రిని నాయకులు ఘనంగా సన్మానించారు. వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, గండ్రెడ్డి రామునాయుడు, మొల్లి చిన్న, గౌస్, కమరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

‘గుడివాడ’ కుటుంబానికి వెన్నుదన్నుగా..

మిందితో పాటు 68వ వార్డు ప్రజలందరూ గుడివాడ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహించారని అమర్‌నాథ్ అన్నారు. కార్పొరేటర్‌గా అనూషను గెలిపించి గుడివాడ కుటుంబాన్ని ఆదరించారన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రూ.500 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. వైఎస్సార్ సీపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సముచితస్థానం కల్పించారన్నారు. ప్రతీ కార్యకర్త జగన్ సైనికుడిగా ప్రజల వద్దకు వెళ్లి, ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ కూటమి చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దన్నారు. వారి అబద్ధపు హామీల మాయలో పడవద్దని కోరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ గుడివాడ అనూష, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుడివాడ లతీష్ కోరారు. కార్యక్రమంలో నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, ఈటి రంగారావు, బోనెల జోసెఫ్, నేలపాటి సత్యవతి, గొంతిన సత్యవతి, పోలవరపు శ్రీహరి, ఈటి సురేష్, రొక్కం వెంకటరావు, ఆదిబాబు, గుడివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని, అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని 13వ జిల్లా అదనపు న్యాయమూర్తి జి.షణ్ముఖరావు అన్నారు. బాధితులకు చట్టం ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. మహిళా చట్టాలపై మండల లీగల్ సర్వీస్ కమిటీ, స్వాతి మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపులు, గృహహింస, భరణం, కట్నం వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ నాయకులు బి.వి.ఎం.కృష్ణ, ఫరా, రాజ్యలక్ష్మి, రాణి, బేబీరాణి, ఆర్.సూర్యనారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రకాశ్, లీ ఫార్మా డైరెక్టర్ లీలారాణి, ధనంజయ్

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జేసీఐ వైజాగ్ స్టీల్‌సిటీ, లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ స్మూత్ వాక్ పేరుతో మోకాలి, భుజం, నడుం, కీళ్ల నొప్పులకు సంబంధించి ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి, జేసీఐ అధ్యక్షుడు ధనంజయ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. లీ ఫార్మా డైరెక్టర్ లీలారాణి మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిబిరంలో ఎముకలకు సంబంధించిన పరీక్షలు, వైద్యుల పరిశీలన, ఆహార సమతుల్యతల వివరణలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు 500 మంది రోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జేసీఐ స్టీల్ సిటీకి చెందిన సరోజిని, న్యూట్రిషనిస్ట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.